సాక్షి
నంద్యాల
గురువారం। 24। అక్టోబర్। 2024




అన్నదానానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద వితరణకు బుధవారం విజయవాడకు చెందిన లోకేశ్వర రావు రూ. లక్ష, హైదరాబాద్‌కు చెందిన క్రాంతిరేఖ రూ.లక్ష విరాళాన్ని అందించారు.



కొనలేం.. తినలేం

కూరగాయల ధరలు వినియోగదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అంతంతమాత్రం సాగు చేసిన పంటలు వరుసగా కురుస్తున్న వర్షాలతో దెబ్బతింటుండటంతో దిగుబడులు పడిపోయాయి. 8లో▸



కార్తీకంలో ఆర్జిత సేవలు రద్దు

శ్రీశైల మహాక్షేత్రంలో నవంబరు 2 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు నిర్వహించనున్న కార్తీక మాసోత్సవాల సందర్భంగా ఆర్జిత సేవలు నిలిపివేయనున్నారు. - 8లో▸

న్యూస్‌రీల్

జిల్లాలో మోస్తరు వర్షం

నంద్యాల(అర్బన్): జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు 87.0 మి.మీ వర్షం కురిసింది. ఆళ్లగడ్డ మండలంలో అత్యధికంగా 24.0 మి.మీ వర్షం కురవగా.. ఆత్మకూరులో 0.6 మి.మీ వర్షం పడింది. రుద్రవరంలో 20.2, కొలిమిగుండ్లలో 18.4, కొత్తపల్లెలో 8.4, శ్రీశైలం 6.2, శిరివెళ్ల 5.0, దొర్నిపాడు 2.2, జూపాడుబంగ్లా 2.0 మి.మీ చొప్పున వర్షం కురిసింది.

వెబ్‌సైట్‌లో అర్హుల జాబితా

నంద్యాల(అర్బన్): జిల్లా పరిధిలోని మహిళా అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొన్నాపురం కాలనీ శిశు గృహ, ఆళ్లగడ్డ బాలసదనం స్టేట్ అప్షన్ ఏజెన్సీలలో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అర్హుల జాబితాను httpr://nandyal.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామని జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారత అధికారిణి లీలావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే రాత పూర్వకంగా ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 26లోపు కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు.

29, 30 తేదీల్లో ఉద్యోగుల క్రీడాపోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 29, 30 తేదీల్లో స్థానిక ఇండోర్ స్టేడియంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29న అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, 30వ తేదీన స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, చెస్, కుస్తీ, బెస్ట్ ఫిజిక్యూ, మ్యూజిక్ డ్యాన్స్ అండ్ షార్ట్ ప్లే, యోగా, ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారిని నవంబర్ 6 నుంచి 9వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 87612611576 సంప్రదించాలన్నారు.

పోలీస్ కంట్రోల్ రూమ్ తనిఖీ

నంద్యాల(సిటీ): స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న పోలీస్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా బుధవారం తనిఖీ చేశారు. కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించిన 250 సీసీ కెమెరాలు, బృహస్పతి కెమెరాల పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిరంతరం పర్యవేక్షిస్తూ, అప్రమత్తంగా ఉండాలన్నారు. సీసీ కెమెరాలు నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

నంద్యాల విద్యార్థినికి ఐదు గోల్డ్‌మెడల్స్



తల్లిదండ్రులతో సింధుజా

నంద్యాల(న్యూటౌన్): బెంగళూరు యూనివర్సిటీలో ఎంఏ హిస్టరీ చదువుతున్న నంద్యాలకు చెందిన సింధుజా 5 గోల్డ్ మెడల్స్ సాధించింది. సింధుజా తల్లి భారతి.. గోనెగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తోంది. తండ్రి అరుణ్‌కుమార్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. బెంగళూరు యూనివర్సిటీలో ఎంఏ చేస్తూ వివిధ విభాగాల్లో ఐదు బంగారు పతకాలు సాధించానని సింధుజా తెలిపారు. యూనివర్సిటీ చైర్మన్ శశిధర్, ప్రొఫెసర్లు ఉషా, మస్తాన్‌తోపాటు తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తాను బంగారు పతకాలు సాధించానన్నారు. కాగా సింధుజాను పలువురు అభినందించారు.

డిగ్రీ ఫెయిల్ విద్యార్థులకు వన్‌టైమ్ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో (స్వయం ప్రతిపత్తి) 2014 నుంచి 2018 మధ్య డిగ్రీ చదివి సెమిస్టర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు వన్‌టైమ్ చాన్స్ కింద పరీక్షలు నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అండర్-14 ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి అండర్-14 ఫెన్సింగ్ పోటీలను బుధవారం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు, స్కూల్ గేమ్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్, రాష్ట్ర స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఉన్నతాధికారి భానుమూర్తి రాజు ప్రారంభించారు. 12 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు, 50 మంది క్రీడాధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో క్రీడా భారతి జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోత్స్న, గౌరవాధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్, అడ్వైజర్ విశ్వనాథ్, ఫిజికల్ డైరెక్టర్లు శివకుమార్, సాల్మాన్, భరత్‌రెడ్డి, చంద్ర, కవిత పాల్గొన్నారు.

పింఛన్లపై పచ్చ కత్తి


ప్రజలను వంచించడంలో నారా చంద్రబాబు ముందు వరుసలో ఉంటారనేది మరో సారి రుజువవుతోంది. ఎన్నికల హామీలను విస్మరిస్తూనే సంక్షేమ పథకాల్లో కోతకు పదును పెట్టారు. పింఛన్ పెంపు అంటూనే వెనుక నుంచి తొలగింపునకు 'పచ్చ' జెండా ఊపారు. ఓ వైపు దరఖాస్తులు తీసుకుంటామంటూ మరో వైపు వేటుకు కూడా రంగం సిద్ధం చేశారు. అనర్హత పేరుతో అత్యధికంగా తొలగించాలని ఆదేశించడం, ఈ క్రమంలోనే మరో సారి జన్మభూమి కమిటీలు ఏర్పాటవుతాయనే చర్చ జరుగుతుండటంతో తమ పింఛన్ ఉంటుందా.. పోతుందా అని ఆందోళన లబ్ధిదారుల్లో మొదలైంది.

- అనర్హత పేరుతో తొలగింపునకు కసరత్తు
- 50 రోజుల ప్రణాళికతో రంగం సిద్ధం
- ఉమ్మడి జిల్లాలో కోత టార్గెట్.. లక్ష పింఛన్లు
- మితిమీరనున్న తెలుగు తమ్ముళ్ల జోక్యం
- లబ్ధిదారుల్లో మొదలైన ఆందోళన

పింఛన్ కోసం ప్రదక్షిణలు



ఈ చిత్రంలో కనిపించే వ్యక్తిపేరు షేక్‌ఖాజా బాషా. కర్నూలు మండలం గార్గేయపురం గ్రామానికి చెందిన ఇతనికి 56 ఏళ్లు. ఎకరం పొలం ఉంది. కొన్నేళ్ల క్రితం కింద పడటంతో తుంటి ఎముక విరిగింది. ఆపరేషన్ అవసరం ఉన్నా.. చేయించుకోలేని పరిస్థితి. నడవ లేని స్థితిలో ఉన్నారు. కుమారుడు ఉన్నా... దూర ప్రాంతాలకు వలస వెళ్లారు. వృద్ధాప్య పింఛన్ కోసం ఈ ఏడాది జూన్ నుంచి గ్రామ సచివాలయం, మండల పరిషత్ కార్యాలయం, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నాడు. పింఛన్ దరఖాస్తు ఆన్‌లైన్ చేసేందుకు కూడా ప్రభుత్వం అవకాశం ఇవ్వలేదు.



కర్నూలు(అగ్రికల్చర్): 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్ ఇస్తామంటూ కూటమి నేతలు హామీలు గుప్పించారు. ఇంట్లో 50 ఏళ్ల వారు ఎంత మంది ఉంటే అందరికీ పింఛన్.. అంటూ ఊరించారు. అధికారం చేపట్టి దాదాపు 5 నెలలు అవుతోంది. కొత్త పింఛన్లు దేవుడెరుగు.. ఉన్న వాటిని తొలగించేందుకు సిద్ధమవుతుండంతో అవ్వాతాతలు, వితంతువులు, వికలాంగులు, చేనేత కారులు తదితర పింఛన్‌దారుల గుండెల్లో గుబులు మొదలైంది. పింఛన్ పోతే తమ పరిస్థితి ఏమిటనీ, ఎవ్వరు పట్టించుకుంటారనే భయం వారిలో వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఉన్న పింఛన్లను అడ్డుగోలుగా తొలగించేందుకు కసరత్తు మొదలైంది. ఇందు కోసం 50 రోజుల ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేసింది. నవంబరు నెలలో ఓ వైపు కొత్త పింఛన్లకు దరఖాస్తులు స్వీకరించడంతో పాటు ఉన్న పింఛన్లలో అనర్హులను గుర్తించేందుకు తనిఖీలు కూడా చేపట్టనున్నారు. అనర్హత పేరుతో అత్యధికంగా పింఛన్లను కోత కోసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. పది కాదు.. వంద కాదు... ఏకంగా వేలల్లో తొలగించేందుకు చర్యలు చేపట్టింది. అక్టోబరు నెలలో కర్నూలు జిల్లాలో 2,41,843, నంద్యాల జిల్లాలో 2,18,223 పింఛన్‌లు ఉన్నాయి. ఒక్కో జిల్లాలో 50 వేలకు తగ్గకుండా అంటే ఉమ్మడి జిల్లాలో లక్ష పింఛన్‌లను తొలగించనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు తొలగింపులపై సెర్ప్ మౌఖికంగా ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీన్ని బట్టి చూస్తే అనర్హత సాకుతో అర్హుల పింఛన్లపై కూడా వేటు వేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హతనే ప్రమాణికంగా తీసుకొని ఏడాదికి రెండుసార్లు పింఛన్‌లు మంజూరు చేస్తూ వచ్చింది. గత టీడీపీ ప్రభుత్వంలో రూపొందించిన మార్గదర్శకాల ప్రకారమే (సిక్స్‌స్టెప్స్ వాల్యుడేషన్) పింఛన్‌లు మంజూరు చేసింది. అయితే వైఎస్సార్‌సీపీ పాలనలో అనర్హులకు ఇచ్చారని, తొలగింపునకు సిద్ధంగా ఉండాలని ఓ పథకం ప్రకారం ప్రభుత్వం సంకేతాలు ఇస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 6,321 పింఛన్లను కోత కోశారు. కర్నూలు జిల్లాలో 3,844, నంద్యాల జిల్లాలో 2,477 పింఛన్లు తొలగించారు.

50 ఏళ్లకే పింఛన్ ఏదీ..



కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు 5 నెలలు కావస్తున్నప్పటికీ 50 ఏళ్లకే పింఛన్ ఊసే లేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 50 ఏళ్ల బీసీ, ఎస్టీ, ఎస్సీ, ముస్లింలు దాదాపు 2 లక్షల మంది ఉంటారు. వీరిలో కనీసం లక్ష మందికి పైగా అర్హులు ఉంటారు. వీరందరూ కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. రోజులు, నెలలు గడుస్తున్నప్పటికీ కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కూడా ఇవ్వలేదు. ప్రతి వారం కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండలాల్లో జరిగే గ్రీవెన్స్‌కు కొత్త పింఛన్‌ల కోసం వినతులు వెల్లువెత్తున్నాయి. ఈ ఏడాది జూన్ నెల నుంచి గ్రామ సచివాలయం మొదలు కొని జిల్లా స్థాయి వరకు కొత్త పింఛన్‌ల కోసం లక్ష వరకు దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది.

అర్హతకే పాతర..

పింఛన్ లబ్ధిదారులను నిర్ణయించడంలో టీడీపీ నేతలు కీలకం కానుండటంతో లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే పింఛన్ల తొలగింపునకు నియోజక వర్గాల వారీగా టీడీపీ నేతల చేతికి జాబితా సిద్ధం అందినట్లు తెలుస్తోంది. వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి అనర్హత వేటు వేయించాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలుస్తోంది. టీడీపీ నేతలు ఇచ్చే జాబితాల్లోని ఉన్న వారికి నోటీసులు ఇచ్చి ఆ తర్వాత తొలగించడానికి అధికారులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో తెలుగు తమ్ముళ్ల సిపారస్సులు ఉన్న వారికే కొత్త పింఛన్లు ఇస్తారని ప్రచారం జరుగుతోంది. జనవరి నెల నుంచి మళ్లీ జన్మభూమి-2 కార్యక్రమం చేపడుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రకటించడంతో జన్మభూమి కమిటీలు కూడా రాబోతున్నాయని గ్రామాల్లో టీడీపీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. జన్మభూమి కమిటీలు ముడుపులు ఇచ్చిన వారికి, అనర్హులకే సంక్షేమ పథకాలు మంజూరవుతాయనేది అందిరికీ తెలిసిందే.

అక్టోబరు నెలలో ఉమ్మడి జిల్లాలోని పింఛన్ల వివరాలు

పింఛన్‌లు	కర్నూలు	నంద్యాల
వృద్ధాప్య	1,23,058	1,11,289
వితంతు	71,184	62,370
వికలాంగులు	31,209	25,851
చేనేత	2,909	875
కల్లుగీత	236	226
హిజ్రాలు	243	240
ఒంటరి మహిళ	5,852	4265
మత్స్యకారులు	810	1792
సీకేడీయూ (ప్రభుత్వం ఆసుపత్రులు)	130	101
సీకేడీయూ (ప్రైవేటు హాస్పిటళ్లు)	294	173
డప్పు కళాకారులు	1,435	2,883
చర్మకారులు	1,133	2,405
డీఎంహెచ్‌ఓ	784	1,264
కళాకారులు	36	21
సైనిక్ వెల్ఫేర్	06	05
అభయహస్తం	2,524	4,365
మొత్తం	2,41,843	2,18,225

వైఎస్సార్‌సీపీ హయాంలో ఏడాదికి రెండు సార్లు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏడాదికి రెండు సార్లు కొత్త పింఛన్లు ఇచ్చేవారు. ఏటా జనవరి, జూలై నెలల్లో కొత్త పింఛన్‌లను అర్హులైన వారందరికీ రాజకీయాలకు అతీతంగా అర్హత ప్రామాణికంగా మంజూరు చేసేవారు. గ్రామ, వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే చాలు.. ఆటోమేటిక్‌గా పింఛన్ మంజూరయ్యేది. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో కొత్త పింఛన్‌లు 1.50 లక్షలకుపైగా ఇవ్వడం జరిగింది.

కొత్త పింఛన్లు ఇవ్వాలి



ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్లు ఇస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు కనీసం దరఖాస్తులు కూడా తీసుకోలేదు. నాకు మూడు ఎకరాల పొలం ఉంది. వర్షం పడితేనే పంటలు పండేది. గొండా పనికి పోతూ బతుకుతున్నాం. మాకు 50 ఏళ్లు నిండాయి. కొత్త పింఛన్లు ఇస్తే మాలాంటి వారికి ఎంతో ఆసరాగా ఉంటుంది.

– హుసేన్ బాషా, బండి ఆత్మకూరు, నంద్యాల జిల్లా

స్వర్ణ రథంపై విహరించిన ఆదిదంపతులు



స్వామి అమ్మవార్లను స్వర్ణ రథంపై ఊరేగిస్తున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు స్వర్ణ రథోత్సవం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఈఓ ఇ.చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు వేకువజామున స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు జరిపించారు. రథారూఢులైన స్వామిఅమ్మవార్లకు విశేషపూజల అనంతరం ఆలయ మహాద్వారం ముందుభాగం నుంచి నాలుగు మాడవీధులగుండా స్వర్ణ రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

నవంబర్ 30లోపు రీసర్వే పనులు పూర్తి చేయండి

- సీఎంఓ ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి
- ఫ్రీ హోల్డ్ భూముల ప్రక్రియపై జాగ్రత్తలు తీసుకోండి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: రీ సర్వేపై వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నవంబర్ 30లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. 211 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని, రీ సర్వేలో భూ సమస్యలకు వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతగా తీసుకొని పరిష్కరించాలని సూచించారు. రోవర్‌తో, భౌతికంగా కొలతలు వేసినా ఒకే విస్తీర్ణం వస్తుందన్న విషయాన్ని రైతులకు వివరించడంతో పాటు విస్తీర్ణంలో సాగు చేసి ఉంటే సంబంధిత పంటలపై కూడా రీసర్వే చేయించాలన్నారు. జిల్లాలో ఏడు జాతీయ రహదారుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని వీటికి సంబంధించి భూ సేకరణ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సీఎంఓ నుంచి వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతగా తీసుకొని పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన దరఖాస్తులలో పెండింగ్‌లో ఉన్న వాటిని క్లియర్ చేయాలన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద రూ.25 లక్షల వరకు ప్రభుత్వం సమకూరుస్తుందని ఇందుకు సంబంధించిన దరఖాస్తులను వెంటనే పంపాలని సూచించారు. జిల్లాలో 14,280 ఎకరాల ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి స్వయం సంతకాల ప్రతులను అందజేయాలన్నారు. డీవియేషన్ చేసిన భూముల వివరాలను కేటగిరీల వారీగా పంపాలన్నారు. ప్రభుత్వానికి నివేదించిన 65,380 ఎకరాలో 14,214 ఎకరాలు డివియేషన్ చేసినట్లు పేర్కొన్నారని ఇందుకు సంబంధించి గ్రామ, మండల, సర్వే నంబర్ల వారీగా నివేదికలు ఇవ్వాలన్నారు. ఇందులో 1652 ఎకరాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయినట్లు తెలిపారు. జిల్లాలో నిబంధనలు పాటించకుండా ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగిందని ఇందుకు ప్రభుత్వం తీసుకునే చర్యలకు కూడా సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్ హెచ్చరించారు. 264 ఎకరాలు సర్వీస్ ఇనాం భూములకు డీవియేషన్ నివేదికలు ఇచ్చారని అందుకు కారణాలను వివరించాలన్నారు. ఆర్ఓఆర్ కేసులకు సంబంధించి ఎండార్స్ ఇవ్వకుండా స్పీకింగ్ ఆర్డర్స్ ఇవ్వాలన్నారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ మాట్లాడుతూ రీ సర్వే పనులు పూర్తి చేయడంతో పాటు కోర్టు కేసులకు సంబంధించి జారీ చేసిన ఉత్తర్వులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. 25 కంటెంప్ట్ కేసులు, 14 లోకాయుక్త కేసులు ఉన్నాయని వెంటనే క్లియర్ చేయాలని జేసీ ఆదేశించారు. 261 సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు ఓటర్ల జాబితా వచ్చేనెల 6లోపు పూర్తి చేయాలన్నారు. శ్మశాన వాటికలకు స్థలాలను గుర్తించి నివేదికలను అందజేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ పద్మజ, ఆర్డీఓలు మల్లికార్జున్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ఎం.దాసు తహసీల్దార్లు పాల్గొన్నారు.

పరిహారం..పరిహాసం

గత రబీలో వర్షాభావ పరిస్థితుల వల్ల జిల్లాలోని పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కేంద్రబృందం జిల్లాలో పర్యటించి పరిస్థితులను కళ్లారా చూసి వెళ్లి నాలుగు నెలలు పుతున్నా రైతన్నలకు పంట నష్టపరిహారం అందలేదు. అన్నదాతలు మాత్రం ఆశలు చంపుకోలేక రబీ పోతే ఖరీఫ్.. ఖరీఫ్ పోతే రబీ అంటూ పంటలు సాగు చేసి అప్పుల పాలవుతున్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోంది. – కోవెలకుంట్ల

- గతేడాది రబీలో వర్షాభావంతో దెబ్బతిన్న పంటలు
- శనగ, జొన్నతోపాటు 16 రకాల పంటలకు తీవ్ర నష్టం
- జిల్లాలో 38,801 హెక్టార్ల పంట నష్టానికి రూ.37.76 కోట్ల పరిహారం విడుదలకు ప్రతిపాదన
- జూన్‌లో కరువు మండలాల్లో పర్యటించిన కేంద్ర బృందం
- నాలుగు నెలలైనా అందని పరిహారం

2023-24 సంవత్సరంలో రబీ సీజన్‌పై జిల్లాలోని 29 మండలాల పరిధిలో 1.36 లక్షల హెక్టార్లలో రైతులు శనగ, జొన్న, మొక్కజొన్న, మినుము, కంది, ఉల్లి, తదితర పంటలు సాగు చేశారు. విత్తనం వేసినప్పటి నుంచి ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో రైతుల ఆశలు అడియాసలయ్యాయి. విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.40 వేలు వెచ్చించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కనీసం విత్తనం కూడా మొలకెత్తకుండా పోవడంతో పెట్టుబడులు నేలపాలయ్యాయి. ఆయా మండలాల్లో 38,801 హెక్టార్లలో శనగ, జొన్న, మినుము, కంది, మొక్కజొన్న, తదితర 16 రకాల పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ఏడాది మార్చి నెలలో జిల్లాలో 12 మండలాలను కరువు మండలాలుగా గుర్తించింది. ఆ తర్వాత ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఎన్యూమరేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. సార్వత్రికల ఎన్నికల పోలింగ్ అనంతరం ఈ-క్రాప్ డేటా ఆధారంగా ఎన్‌డీఆర్ఎఫ్ మార్గదర్శకాల ప్రకారం ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల కోసం జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదికలు పంపింది. జిల్లాకు నష్టపరిహారం కింద రూ.37.76 కోట్లు అవసరమవుతాయని ఆ నివేదికలో పేర్కొంది.



కోవెలకుంట్ల సమీపంలో వర్షాభావంతో ఎండిపోయిన పప్పుశనగ పంట(ఫైల్)



జిల్లాలో పంటనష్టంపై ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న కేంద్రబృందం(ఫైల్)

కేంద్ర బృందం పర్యటించినా అందని పరిహారం

కేంద్రబృందం ఈ ఏడాది జూన్ 20న జిల్లాలో పర్యటించింది. ఐఏఎస్ అధికారులు డిపార్ట్‌మెంట్ ఆఫ్‌ఎక్స్ పెండేచర్ డైరెక్టర్ చిన్మయ పుండ్లిక్‌రావు గాట్మేర్, తాగునీరు, పారిశుద్ధ్యశాఖ డిప్యూటీ అడ్వైజర్ ఆసిస్ పాండే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ అరవింద్‌కుమార్, సోని, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి తదితరులు కోవెలకుంట్ల మండలం భీమునిపాడు గ్రామంలో రైతులతో ముఖాముఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, నందికొట్కూరు వ్యవసాయ సబ్‌డివిజన్లలో రబీసీజన్‌లో దెబ్బతిన్న పంటల ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్రబృందం పరిశీలించింది. వర్షాభావ పరిస్థితులతో రబీలో సాగు చేసిన పంటల్లో తీవ్ర నష్టం వాటిల్లి పెట్టుబడులు నేలపాలయ్యాయని రైతులు కేంద్రబృందం ఎదుట ఏకరువు పెట్టారు. శనగ, జొన్న, మినుము, కంది, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోయారు. దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. వర్షాభావంతో రైతులకు జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించామని, నివేదికలను ప్రభుత్వానికి పంపంచి ఆదుకుంటామని కేంద్రబృందం హామీ ఇచ్చింది. ఇప్పటికి నాలుగు నెలలు దాటినా పంటనష్ట పరిహారం ఊసే లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముందుకు సాగని ప్రస్తుత రబీ

గత ఏడాది వర్షాభావ పరిస్థితులతో పంటనష్టం సంభవించి రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి రబీ సీజన్ ప్రారంభం కాగా భారీ వర్షాలు వెంటాడుతున్నాయి. జిల్లాలో ఈ ఏడాది రబీలో 1.75 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగు కావాల్సి ఉంది. ఈ నెల మొదటి వారం నుంచి అన్ని రకాల పంటల సాగుకు అదును కాగా ఆయా మండలాల పరిధిలో అత్యధికంగా 62,203 హెక్టార్లలో పప్పుశనగ పంట సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 249 హెక్టార్లలో మాత్రమే సాగైంది. జొన్న 30,232 హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 3,963, మొక్కజొన్న 10,800 హెకార్టకు గాను 319, మినుము 27,957 హెక్టార్లకు గానూ 871 హెక్టార్లు సాగైంది. ఇక పొగాకు 1998, వేరుశనగ 182, కంది 56, మిరప 32 హెక్టార్ల చొప్పున సాగయ్యాయి. ఇప్పటి వరకు జిల్లాలో 7,686 హెక్టార్లలో మాత్రమే వివిధ పంటలు సాగయ్యాయి. ఆయా పంటల సాగుకు వచ్చే నెల 15వ తేదీ వరకు మాత్రమే గడువు ఉండటం, వర్షాలు కొనసాగుతుండటంతో రైతులు దిగులు చెందుతున్నారు. మరో తుపాన్ ప్రభావంతో వర్షాలు పడే ఆస్కారం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

నియామకం



ఖలీద్‌సైఫుల్లా

కర్నూలు(సెంట్రల్): ఆలిండియా కాంగ్రెస్ డేటా అండ్ టెక్నాలజీ విభాగం వైస్ చైర్మన్‌గా కర్నూలు వాసి ఖలీద్ సైఫుల్లాను నియమిస్తూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు ఇచ్చారు. ఇది కాంగ్రెస్‌లో అత్యుత్తమ పదవుల్లో ఒక్కటి. ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ పదవికి కర్నూలు వాసి ఎంపిక కావడంపై డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. సైఫుల్లా చిన్న తనంలో ఎస్‌ఆర్ పేటలోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లిష్ మీడియం స్కూలులో చదువుకున్నారు. ఉన్నత విద్యాభ్యాసం పూర్తయ్యాక సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేల నమ్మకాన్ని వమ్ము చేయనని ఖలీద్‌సైఫుల్లా పేర్కొన్నారు.

హెచ్‌డబ్ల్యూఓస్ జేఏసీ చైర్మన్ ఎన్నిక



పి.శ్రీనివాసులు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రభుత్వ వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం జేఏసీ చైర్మన్‌గా పి. శ్రీనివాసులు (బీసీ సంక్షేమం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మూడు సంక్షేమ శాఖలకు చెందిన వసతి గృహ సంక్షేమాధికారులు సమావేశం ఏర్పాటు చేసుకొని జేఏసీగా ఏర్పడ్డారు. జేఏసీ గౌరవాధ్యక్షుడిగా పి.సత్యనారాయణరాజు, గౌరవ సలహాదారుగా ఎం.వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.నాగమద్దయ్య (సాంఘిక సంక్షేమం) ఆర్థిక కార్యదర్శిగా ఓబులేసు (గిరిజన సంక్షేమం), ఉపాధ్యక్షులుగా పి.మాదప్ప, ఎస్. గిరిజాదేవి, బెన్నమ్మ, సంయుక్త కార్యదర్శులుగా కే.హారతిదేవి, రజిని, సిద్దప్ప, కే. అబ్దుల్ అజీమ్, ఈసీ మెంబర్లుగా బసవరాజు,మదారి, రాజశేఖర్‌రెడ్డి, వలి, క్రాంతి ఎన్నికయ్యారు.

కాల్వబుగ్గ మాజీ ఈఓపై కేసు నమోదు

ఓర్వకల్లు: కాల్వబుగ్గ దేవస్థాన నిధులను భారీ ఎత్తున స్వాహా చేసిన మాజీ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్‌పై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన ఇటీవల దేవస్థానం పేరిట సొంత బ్యాంకు ఖాతాను తెరచి, ఆలయానికి వచ్చిన నిధులను తన వ్యక్తిగత ఖాతాకు మళ్లించినట్లు అధికారులు చేపట్టిన విచారణలో తేలిందన్నారు. అయితే ఇప్పటివరకు నిజాలను నిరూపించకుండా పరారీలో ఉండడంతో ప్రస్తుత ఈఓ మద్దిలేటి ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి 9.30 గంటల సమయంలో డీఆర్‌కేవీ ప్రసాద్‌పై ఆర్థిక నేరం కింద పరిగణిస్తూ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



బనగానపల్లె: స్థానిక పోలీసుస్టేషన్ పరిధిలోని తమ్మడపల్లి దారిలో ఉన్న ఎస్‌ఆర్ బీసీ సబ్ కాల్వలో బుధవారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ దుగ్గిరెడ్డి తెలిపారు. మహిళ వయస్సు 35 ఏళ్లు ఉండొచ్చని, ఆనవాళ్లు గుర్తించిన వారు 92211 01124, 91211 01042 నంబర్లకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

కూరగాయలు కొనలేం.. తినలేం!

- ప్రభుత్వ ప్రోత్సాహం లేక తగ్గిపోయిన సాగు
- సబ్సిడీ విత్తనాల పంపిణీ సున్నా
- గతేడాది ఖరీఫ్‌లో 11868 ఎకరాల్లో కూరగాయల సాగు
- ఈ ఏడాది 6976 ఎకరాలకే పరిమితం
- వరుస తుపానులతో దెబ్బతిన్న పైర్లు
- గతేడాది అక్టోబరుతో పోలిస్తే భారీగా పెరిగిన ధరలు
- వినియోగదారుల ఉక్కిరిబిక్కిరి



కర్నూలు(అగ్రికల్చర్): కూరగాయల ధరలు వినియోగదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కూరగాయల సాగుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అంతంతమాత్రం సాగు చేసిన పంటలు వరుసగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతింటుండటంతో దిగుబడులు పడిపోయాయి. గతేడాది ఖరీఫ్‌తో పోలిస్తే ఈసారి కూరగాయల సాగు భారీగా పడిపోయింది. డిమాండ్‌కు తగ్గట్టుగా ఉత్పత్తి లేకపోవడంతో మార్కెట్‌లో కొరత ఏర్పడింది. దీంతో ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే బియ్యం, పప్పులు, వంట నూనెలతో పాటు వివిధ నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయి. ధరలు పెరుగుదలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పుడు కూరగాయల ధరలు కూడా వినియోగదారులకు ఆందోళన కలిగిస్తున్నాయి. రైతుబజార్లలోనే ధరలు భారీగా ఉంటున్నాయి. బయట మరింత ఎక్కువగా ఉంటున్నాయి. జిల్లాలో క్యాలీఫ్లవర్, క్యాప్సికం, క్యారెట్, క్యాబేజీ, ఆలు తదితర అన్ని రకాల కూరగాయలు పండుతాయి. వీటిని తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. అయితే ఈ ఏడాది వరుసగా ఏర్పడుతున్న తుపానుల వల్ల పంటలు దెబ్బతింటున్నాయి. వేరుకుళ్లు, కాయకుళ్లు వంటి తెగుళ్ల సోకడం, నేలతో తేమ ఎక్కువై పంటలు కుళ్లుతుండటంతో కూరగాయల కొరత ఏర్పడుతోంది. దీంతో కూరగాయలకు డిమాండ్ ఏర్పడుతోంది. జిల్లాకు వివిధ ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి అవుతున్నాయి.

తగ్గిన సాగు విస్తీర్ణం!

ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో రైతులకు కూరగాయల సాగుపై ఆసక్తి తగ్గిపోయింది. 2023 ఖరీఫ్ ఈ–క్రాప్ వివరాల ప్రకారం ఉల్లి, టమాటతో సహా కూరగాయల సాగు 60614 ఎకరాల్లో సాగయ్యింది. ఉల్లి, టమాట మినహాయిస్తే కూరగాయల పంటలు 11868 ఎకరాల్లో సాగయ్యాయి. సాగు పుష్కలంగా ఉండటంతో గత ఏడాది కూరగాయల కొరత ఏర్పడలేదు. ధరలు పెరిగిన దాఖలాలు లేవు. ఈ ఏడాది మొత్తం కూరగాయల సాగు విస్తీర్ణం 58382 ఎకరాలు కాగా... ఉల్లి, టమాట పంటలను మినహాయిస్తే కేవలం 6976 ఎకరాల్లో మాత్రమే కూరగాయల పంటలు సాగయ్యాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకాలు లేకపోవడంతో సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అంతంతమాత్రం సాగైన పంటలు కూడా అధిక వర్షాలతో దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడులు పడిపోవడంతో కొరత ఏర్పడి ధరలు పెరుగుతున్నాయి.

ప్రభుత్వ ప్రోత్సాహం సున్నా

కూరగాయల కొరత ఏర్పడకుండా సాగును ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇందుకోసం సబ్సిడీలు కూడా ఇవ్వాల్సి ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో కూరగాయల సాగుకు ప్రోత్సాహం లేకపోవడం రైతులకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద కూరగాయల సాగుకు ప్రోత్సాహకాలు ఉన్నా ఆచరణలో అమలు కావడం లేదు. 50 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయాల్సి ఉండగా ఈ ఏడాది ఒక్క రైతుకు కూడా అందించిన దాఖలాలు లేవు. ఖరీఫ్ ముగిసిపోయింది. రబీలో దాదాపు నెల గడుస్తోంది. ఇంతవరకు ఒక్క రైతుకు కూడా సబ్సిడీపై విత్తనాలు ఇవ్వలేదంటే ప్రభుత్వం మొద్దునిద్ర ఏ స్థాయిలో ఉందో ఊహించవచ్చు.

2023 అక్టోబరుతో పోలిస్తే ప్రస్తుతం కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి

కూరగాయలు	2023 అక్టోబరు 22న ధర (రూ)	2024 అక్టోబరు 22న ధర (రూ.)
టమాట	10	30
వంకాయ	30/34	50/64
బెండ	14	50
కాకర	36	50
బీర	34	50
క్యాలీఫ్లవర్	30	34
క్యాబేజీ	20	30
చెవులకాయ	24	50
చిక్కుడు	36	64
ఉల్లిగడ్డలు	40/46	50
దోసకాయ	24	38
దొండకాయ	24	40

ఏ కూరగాయ తీసుకున్నా కిలో రూ.50 పైనే

గతేడాది అక్టోబరు నెలతో పోలిస్తే కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. గతేడాది అక్టోబరులో టమాట కిలో రూ.10, క్యాలీఫ్లవర్ రూ.30, బెండ రూ.14, చెవులకాయ రూ.24 ఇలా ఏ కూరగాయ తీసుకున్నా రూ.30 వరకే ఉన్నాయి. ప్రస్తుతం కూరగాయల ధరలు షాక్ కొడుతున్నాయి. నేడు టమాట రూ.30 నుంచి రూ.50 వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. వంకాయ రూ.40/60 వరకు ఉంటోంది. చెవులకాయలు రూ.36/46 వరకు ఉంటోంది. ఏ కూరగాయ కొనాలన్నా... రూ.50 పైనే ఉంటోంది. గత ఏడాదితో పోలిస్తే కూరగాయల ధరలు 30 నుంచి 50 శాతం వరకు ధరలు పెరిగాయి.

ట్రాక్టర్, ఆటో ఢీకొని వ్యక్తి మృతి

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో మృతి చెందిన సత్యం

కోడుమూరు రూరల్: ఉల్లిగడ్డల లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని అమడగుంట్ల గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గోరంట్లకు చెందిన రైతులు మంగళవారం రాత్రి ట్రాక్టర్‌లో ఉల్లిగడ్డలను వేసుకుని కర్నూలు మార్కెట్‌కు బయలుదేరారు. ఇదే సమయంలో గౌండ సత్యం తాపీ పని ముగించుకుని వర్కర్లతో కర్నూలు నుంచి గోరంట్లకు ఆటోలో బయలుదేరారు. ఈ నేపథ్యంలో అమడగుంట్ల సమీపంలో ఉల్లిగడ్డల సంచులు వేసుకుని ట్రాలీ డోర్లు తెరుచుకుని వెళుతున్న ట్రాక్టర్‌ను లైట్ల వెలుగులో గమనించలేక ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో తోలుతున్న గోరంట్లకు చెందిన సత్యం (38) తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే ఆటోలో ప్రయాణిస్తున్న రోగెన్న, రాజుకు తీవ్రగాయాలవ్వగా, వేణు, గిరినాయుడుకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం కోడుమూరు, కర్నూలు ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. కోడుమూరు ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు. మృతుడు సత్యంకు భార్య చంద్రకళతో పాటు, కుమారుడు, కుమార్తె సంతానం ఉన్నారు. ఇంటి పెద్దదిక్కు మృతితో కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రాప్తాడు రూరల్: తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఓ యువకుడిని అనంతపురం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను సీఐ ఎన్.శేఖర్ వెల్లడించారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం రాంపల్లికి చెందిన అగ్రహారం రంగస్వామి అలియాస్ రంగ పాత నేరస్తుడు. ఇతనిపై కర్నూలు జిల్లా మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, డోన్, అనంతపురం జిల్లా గుత్తి పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు దొంగతనాల కేసులు ఉన్నాయి. ఈ ఏడాది ఆగస్టులో అనంతపురం రూరల్ పీఎస్ పరిధిలోని సోములదొడ్డిలో జరిగిన దొంగతనాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు పక్కా ఆధారాలతో అనంతపురంలోని బళ్లారి రోడ్డులో బుధవారం రంగస్వామిని అరెస్ట్ చేశారు. రూ.8 లక్షలు విలువ చేసే 125 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐలు ఎన్.శేఖర్, ఇస్మాయిల్, ఎస్‌ఐ రాంబాబు, కానిస్టేబుళ్లు పాండవ, శివ, ఆంజనేయప్రసాద్‌ను డీఎస్పీ వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అభినందించారు.

కూరగాయల లారీ బోల్తా

- ఇద్దరికి తీవ్ర గాయాలు



బోల్తాపడిన లారీ

దేవనకొండ: పత్తికొండ నుంచి కర్నూలుకు వెళ్లే రోడ్డులో దేవనకొండ మండలంలోని కరిడికొండ గ్రామం వద్ద కూరగాయల లారీ అదుపుతప్పి బోల్తా పడింది. లారీలోని టమాటాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ తీవ్రంగా గాయపడ్డారు. అక్కడున్న వారు క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. లారీ దేవనకొండకు చెందిన జొన్నల అంజికి చెందినదిగా గుర్తించారు. లారీ బోల్తా పడడంతో రూ.10 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.

అమ్మనాన్నలను చూసేందుకు వచ్చి మృత్యువాత

- గుండెపోటుతో ఏఆర్ కానిస్టేబుల్ మృతి



మృతి చెందిన భూపాల్ (ఫైల్)

డోర్నిపాడు: అమ్మనాన్నలను చూసేందుకు వచ్చిన ఓ కానిస్టేబుల్ వారి ఒడిలోనే గుండెపోటుతో మృతి చెందిన ఘటన మండలంలోని గుండుపాపల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, సుబ్బమ్మ దంపతుల ఒక్కగానొక కుమారుడు భూపాల్ (45) కర్నూలులో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం బ్యాంకు పని నిమిత్తం గోస్పాడుకు వచ్చారు. పని ముగించుకొని అమ్మనాన్నలను చూసొద్దామని సొంత గ్రామం గుండుపాపలకు వచ్చి రాత్రి అక్కడే ఉండిపోయాడు. తెల్లవారుజామున ఛాతిలో తీవ్రంగా నొప్పి రావడంతో వైద్యశాలకు తరలించేందుకు సిద్ధం అవుతుండగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి భార్య గీతతో పాటు ముగ్గురు కూతుళ్లు బోరున విలపించారు. పోలీస్ అధికారులు రిజర్వుడు ఇన్‌స్పెక్టర్ నారాయణ, ఎస్‌ఐ మహాలక్ష్మి, కర్నూలు జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగరాజు గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.



అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

పిల్లల కోసం భర్త ఇంటి ముందు ధర్నా



భర్త ఇంటి ముందు బైఠాయించిన తస్లీమా

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని శారద కమిటీ స్కూల్ వద్ద బుధవారం భర్త ఇంటి ముందు భార్య ధర్నాకు దిగింది. వివరాలు.. పట్టణానికి చెందిన సాదిక్‌తో తస్లీమాకు 14 ఏళ్ల కిందట వివాహం అయ్యింది. వీరికి ముగ్గురు సంతానం. పెళ్లైన ఐదు సంవత్సరాల వరకు సంసారం సాఫీగా సాగింది. తరువాత నుంచి భర్త, అత్తమామలు అనుమానంతో వేధింపులకు గురిచేస్తుండటంతో తస్లీమా తల్లిదండ్రులకు విషయం చెప్పింది. పెద్దలు భార్యభర్తలకు సర్దిచెప్పగా కొద్దిరోజులు బాగుండి మళ్లీ వేధింపులకు గురిచేస్తూ వచ్చారు. ఈ క్రమంలో తనను పుట్టింట్లో వదిలిపెట్టి పిల్లలను మాత్రం భర్త తీసుకెళ్లాడని, పిల్లలను తనకే ఇవ్వాలంటూ బుధవారం తస్లీమా భర్త ఇంటి ముందు ధర్నాకు దిగింది. తనకు న్యాయం జరిగే వరకు కదిలేది లేదని భీష్మించుకొని కూర్చుంది. పిల్లలను తనకు అప్పగించాలని, అలాగే భర్త, అత్తమామల నుంచి ప్రాణహాని ఉందని, వారి నుంచి రక్షణ కల్పించాలని కోరుతోంది. తస్లీమాకు మహిళా సంఘాలు మద్దతుగా నిలిచాయి. పెద్దలు సర్దిచెప్పడంతో మధ్యాహ్నం ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయింది.

గాలేరులో కొట్టుకుపోయిన గేదెలు



నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్న గేదెలు

పాణ్యం: పశుగ్రాసానికి వెళ్లిన గేదెలు నీరు తాగేందుకు గాలేరు – నగరి కాల్వలోకి దిగి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. బుధవారం సుగాలిమెట్ట సమీపంలో 22 గేదెలు కాల్వలోకి దిగాయి. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కొట్టుకుపోయాయి. గమనించిన రైతులు రామతీర్థం, యనకండ్ల వద్ద అతి కష్టం మీద 10 బర్రెలను బయటకు తీశారు. మిగతావి నీటిలో కొట్టుకుపోయినట్లు రైతులు తెలిపారు. ఈ ఘటనపై పాడి రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా కాల్వలో ప్రవాహాన్ని 5 వేల నుంచి 3 వేల క్యూసెక్కులకు తగ్గించారు. గ్రామస్తుడు లక్ష్మానాయక్‌కు చెందిన 6 గేదెలు, ఇతర రైతులకు చెందిన గేదెలు కొట్టుకుపోయినట్లు పశుసంవర్ధకశాఖ అధికారులు వెల్లడించారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిసిన ఏపీఆర్‌ఎస్‌ఏ నాయకులు

కర్నూలు(సెంట్రల్): రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, లక్ష్మీరాజు అధికారులను కోరారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్‌ఎస్‌ఏ) నూతన జిల్లా కమిటీలో మార్పులు జరిగాయి. ఇప్పటివరకు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న వి.గిరికుమార్‌రెడ్డి రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో జిల్లా అధ్యక్షుడిగా సి.నాగరాజు, కార్యదర్శిగా ఎం.లక్ష్మీరాజును ఎన్నుకున్నారు. ఈ క్రమంలో బుధవారం నూతన జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో చిరంజీవి, ఏఓ విజయశ్రీలను మర్యాదపూర్వకంగా వారి కార్యాలయాల్లో కలిశారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరడంతో వారు సానుకూలంగా స్పందించినట్లు జిల్లా అధ్యక్షుడు సి.నాగరాజు తెలిపారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.రజనీకాంత్‌రెడ్డి, కలెక్టరేట్ ప్రెసిడెంట్ ఎం.వెంకటరాజు, కర్నూలు డివిజన్ ప్రెసిడెంట్ వి.రామాంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు లోకేశ్వరి, బీఎల్ కృష్ణవేణి, శివపార్వతి, భాను పాల్గొన్నారు.

ఐటీఐ ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

డోన్ టౌన్: 2024–25 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐల జిల్లా కన్వీనర్, డోన్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, దరఖాస్తు కాపీ, ఒరిజినల్ సర్టిఫికెట్లతో సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో 27వ తేదీలో గా వెరిఫికేషన్ చేయించుకున్న వారికి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు ప్రకటించారు. 28న ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలు, 30న ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు.

హోరాహోరీగా నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికలు



విజేత శాంతి భవానీ ప్యానల్‌ను అభినందిస్తున్న ఏపీ ఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంగళ్‌రెడ్డి, తదితరులు

కర్నూలు (హాస్పిటల్): ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. బుధవారం కర్నూలు మెడికల్ కళాశాలలోని నూతన ఆడిటోరియంలో అధికారి చెన్నమ్మ పర్యవేక్షణలో ఈ ఎన్నికలు నిర్వహించారు. మంజుల బాయి, శాంతి భవానీ ప్యానల్‌లు పోటాపోటీగా రెండు వారాల నుంచి విస్తృతంగా ప్రచారం నిర్వహించాయి. శాంతి భవానీ ప్యానల్‌కు ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ మద్దతు పలికింది. ఈ నేపథ్యంలో ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. బుధవారం ఎన్నికల నిర్వహణ కేంద్రం వద్ద ఇరు వర్గాలు వారి బృందాలతో ఏర్పాట్లు చేసుకున్నాయి. కర్నూలు ప్రభుత్వాసుపత్రితో పాటు జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి పెద్ద ఎత్తున ప్రభుత్వ నర్సులు ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు.

శాంతిభవాని ప్యానల్ గెలుపు

ఎన్నికల్లో శాంతిభవాని ప్యానల్ విజయం సాధించింది. ప్రెసిడెంట్‌గా పోటీ చేసిన లీలావతికి – 160, పి.ఆదిలక్ష్మి – 98 ఓట్లు వచ్చాయి. అలాగే ఉపాధ్యక్షులుగా నిలిచిన జి.శాంతిభవానీకి – 162, శ్రీదేవికి – 97 ఓట్లు, సెక్రటరీ అభ్యర్థులు బంగారికి – 152, డి.మంజుల దేవికి – 112 ఓట్లు, కోశాధికారి స్థానానికి లక్ష్మీనరసమ్మకు – 143, వి.శ్రీదేవికి – 119 ఓట్లు పోలవ్వడంతో అధిక ఓట్లు సాధించిన వారు గెలుపొందారు. వీరితో పాటు ఈసీ మెంబర్లుగా ఎస్.సోమేశ్వరి, జె.ఉమారాణి, యు.ఎం.శాంతిలత, ఎ.ఉమాదేవి, డి.కృష్ణవేణి విజయం సాధించారు. వీరిని ఏపీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ వెంగళ్‌రెడ్డి తదితరులు అభినందించారు.

ప్రజలకు ఉచిత ఇసుకను అందించడమే లక్ష్యం

- మంత్రి టీజీ భరత్

కర్నూలు (సెంట్రల్): కర్నూలు జిల్లాలో వినియోగదారులందరికీ ఉచిత ఇసుక అందివ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయం నుంచి కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, మైనింగ్ శాఖ డీడీ రవిచంద్‌లతో మంత్రి టీజీ భరత్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలందరికీ మేలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తోందన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని సక్రమంగా అమలు చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజలకు అవసరమైన ఇసుకను రీచ్‌ల వద్ద నుంచే కాకుండా ఎక్కడి నుంచైనా తీసుకోవచ్చని చెప్పారు. నది సమీప గ్రామాలు, పట్టణాలకు చెందిన వారు తమ నిర్మాణ అవసరాలకు ఇసుకను తవ్వి ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా తీసుకెళ్లొచ్చన్నారు. దీని వల్ల ఇసుకను తీసుకెళ్లేందుకు ప్రజలపై భారం తగ్గుతుందన్నారు. జేసీబీలతో ఇసుకను తవ్వి ఒకే చోట నిల్వ చేసి అక్రమంగా సంపాదించాలని చూస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు.

కార్తీక మాసంలో ఆర్జిత అభిషేకాలు నిలుపుదల

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో నవంబరు 2 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు నిర్వహించనున్న కార్తీకమాసోత్సవాల్లో ఆర్జిత సేవలు నిలిపేయనున్నట్లు దేవస్థాన ఇన్‌చార్జ్ కార్యనిర్వహణాధికారి ఇ.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కార్తీకమాసం మొదటి, రెండు, మూడు, నాల్గవ శని, ఆది, సోమవారాల్లో గర్భాలయ అభిషేకాలు, మల్లన్న స్పర్శ దర్శనం పూర్తిగా రద్దు చేస్తామన్నారు. అలాగే రద్దీ రోజులలో శని, ఆది, సోమవారాలతోపాటు కార్తీక శుద్ధ ఏకాదశి, పౌర్ణమి రోజులలో అమ్మవారి కుంకుమార్చనను వేదాశీర్వచన మండపంలో ఏర్పాటు చేస్తామన్నారు. రద్దీ రోజులు మినహా సాధారణ రోజుల్లో మూడు విడతలుగా మల్లన్న స్పర్శ దర్శనం ఉంటుందన్నారు.